బక్రీద్ శుభాకాంక్షలు - ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , జూన్ 16 : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అత్యంత పవిత్రమైన బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని, త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే బక్రీద్ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థించాలని కోరారు. పండుగ నేపథ్యంలో ఈద్గాలు మసీదుల వద్ద తగు వసతులను కల్పించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

గెలుపు ఓటములు సహజం..

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16 : క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, పోటీల్లో పాల్గొన్నప్పుడే క్రీడాకారుడి ప్రతిభ వెలుగులోకి వస్తుందని డ్రింక్ ప్రైమ్ వాటర్ ప్యూరిఫైర్ సంస్థ వ్యవస్థాపక సీఈవో ముత్యాల విజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని జీహెచ్ఎంసీ పార్కులో డ్రింక్ ప్రైమ్ వాటర్ ప్యూరిఫైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీపీఎల్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్‌ను సంస్థ సీవోవో మానస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా నగరంలోని 2వేల అపార్ట్‌మెంట్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకోగా..10 జట్లను ఎంపిక చేసి పోటీలను నిర్వహించారు. తుది విజేతకు లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేశారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, జూన్ 16 : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్ డివిజన్, రాంరెడ్డినగర్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి నవగ్రహ ఆలయ వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు బాలరాజు గుప్తా, వామన్ గుప్తా, చంద్రమౌలి గుప్తా, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం ..



ఆలయంలో జరిగిన ప్రత్యేక హోమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, తదితరులు

కుత్బుల్లాపూర్, జూన్ 16 : జీడిమెట్ల డివిజన్, అయోధ్యనగర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నదీమ్ రాయ్, యేసు, సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్యచారి, కృష్ణాచారి, నారాయణ, బాబు, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం ..

బంజారా మహిళా సొసైటీ ఆధ్వర్యంలో మియాపూర్‌లోని వృద్ధాశ్రమంలో ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో గడచిన ఆరేండ్లుగా అన్నదాన వితరణ చేపడుతున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఆనంద్, పరిమళ, డాక్టర్ పూర్ణిమ, సుజాత, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు. *– మియాపూర్ , జూన్ 16*

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రం ఇస్తున్న శ్రీ సాయిహిల్స్ ఓనర్స్ ప్రతినిధులు

మియాపూర్ , జూన్ 16 : మాదాపూర్ డివిజన్, గోకుల్ ప్లాట్స్ శ్రీ సాయి హిల్స్ కాలనీకి అనుసంధానంగా ఉన్న హోజింగ్ బోర్డు స్థలంలో ఓ బడ్డీ కొట్టులో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయిస్తున్నట్లు కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ఫిర్యాదు చేశారు. పెద్ద సంఖ్యలో యువత బడ్డీకొట్టు వద్ద వాటిని సేవిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, మహిళలు, యువతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ప్రశ్నిస్తున్నవారిపై దాడులకు దిగుతున్నారని .. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను విక్రయించే వారెవరైనా ఉపేక్షింది లేదని, పోలీసు శాఖ ద్వారా వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చేస్తామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ప్రాంతాల్లో పోలీసు గస్తీ ఏర్పాటు చేయిస్తామన్నారు. త్వరలో సదరు బడ్డీ కొట్టును మూసి వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీలో ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తామని కాలనీవాసులు ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లో సంగీత విభావరి..

విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్, జూన్ 16 : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో అశ్విత వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగీత విభావరిలో విజేతలుగా నిలిచిన కళాకారులకు ఆయన బహుమతులను అందజేశారు. కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి సంగీత విభావరిలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మహేంద్ర అశ్విత అపార్ట్‌మెంట్స్‌వాసులు పాపారావు, మాధవరావు, ఎంఎన్ మూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి..

అల్లాపూర్, జూన్ 16: మోతీనగర్ ప్రధాన కూడలిలో మంచినీటి పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుండగా జలమండలి అధికారులు పాత పైపులైన్ మార్చి కొత్త పైపులైన్ పనులు మొదలు పెట్టారు. అయితే.. పనుల్లో జాప్యం జరుగుతుండడంతో తాగునీరు వృథాగా పోతున్నది. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్,జూన్16: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు.సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోడ్రన్ స్విఫ్ట్ కార్లకు అనూహ్య స్పందన

మారుతీ సుజుకీ నూతన వెర్షన్ స్విఫ్ట్ జే సిరీస్ 175వ కారును ప్రముఖ ఆటోమొబైల్ డీలర్స్ వరుణ్ మోటార్స్ విజయవంతంగా పూర్తి చేసింది. హాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో నాలుగో తరం స్విఫ్ట్ మెరుగైన మైలేజీ సామర్థ్యంతో వచ్చిన కార్లకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉండగా... ఇప్పటి వరకు 175 కార్లను డెలివరీ చేసినట్టుగా మారుతీ సుజుకీ – వరుణ్‌మోటార్స్ వెల్లడించాయి. బాలానగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ఎం ఎంఎస్ఐఎల్ కౌశిక్, ఈడీ రాజు, వరుణ్ మోటార్స్ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ)

పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

ఖైరతాబాద్, జూన్ 16: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. లక్డీకాపూల్‌లోని ఎస్ఎస్ సెంట్రల్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీషరెడ్డి చేతుల మీదుగా 300 మంది విద్యార్థులకు సహాయత చెక్కులను అందజేశారు. శివారెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా 10వ తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి పైచదువులు చదువుకోలేని విద్యార్థులకు సహాయం అందిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది 500 నుంచి వెయ్యి మంది విద్యార్థులకు రూ.10వేల సాయాన్ని అందజేస్తున్నామన్నారు. నలుగురికి సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారులకు తీవ్ర గాయాలు

మణికొండ, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం అల్కాపూర్ రోడ్డులో ఇద్దరు చిన్నారులు సైకిల్‌ను తొక్కుకుంటూ వస్తున్నారు. ఇదే సమయంలో ఓ ఆటోట్రాలీ అతివేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న చిన్నారుల సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు చిన్నారులు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతున్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

పచ్చదనాన్ని పెంపొందించుకుందాం...

మియాపూర్ , జూన్ 16 : పచ్చదనాన్ని పరిరక్షించుకుని మరింత పెంపొందించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని కాపాడుకుని భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. ఆదివారం అంబీర్ చెరువు వాకర్స్ అసోసియేషన్ షూట్ టు షైన్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో శివమ్మ బస్తీ రామాలయం సమీపంలోని చెరువు కట్టను శుభ్రంచేసి పరిసరాల్లో మొక్కలు నాటారు. దీనికి కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. కేవలం మొక్కలు నాటడంతోనే చాలదని పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరు తమవంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, నర్సింహులు, సిద్ధయ్య, నర్సింహా, గిరి, గోపి, వన్నేస్, సతీష్, రామచందర్, నవీన్, మాధవ్, వాసు ,కృష్ణ, సాంబశివరావు, అశోక్, శ్రీదేవి, విజయ్, ధర్మారెడ్డి, వేణుగోపాల్, సుబ్బారావు, గోపాలకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు సమీపంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలి..

ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పితృదినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్‌లోని గ్రేస్ అనాథాశ్రమంలో పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అనంతరం రామస్వామి యాదవ్ మాట్లాడుతూ ..త్యాగాలకు ప్రతిరూపం తండ్రని.. నిస్వార్థ సేవతో పిల్లల పురోగతి కోసం నిరంతరం శ్రమించే తండ్రి పట్ల అమితమైన ప్రేమానురాగాలను చూపాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులకు మించిన దైవం లేదని.. వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ధర్మసాగర్ పాల్గొన్నారు.

– మియాపూర్ , జూన్ 16

శ్రీకృష్ణానగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి

పుప్పాల భాస్కర్‌ను కలిసిన శ్రీకృష్ణానగర్ కాలనీ ప్రజలు

దుండిగల్,జూన్16 : సూరారం డివిజన్, శ్రీకృష్ణానగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ అన్నారు. శ్రీకృష్ణానగర్, భవానీనగర్‌లకు చెందిన సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణానగర్ సమస్యలను పరిష్కరించడంతోపాటు కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మించేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన భాస్కర్.. సమస్యను ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకువెళ్లి త్వరగా కమ్యూనిటీ హాల్ నిర్మించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవిగుప్తా, సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 16 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ఢిల్లీకి చెందిన నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆధ్యాంతం ఆకట్టుకున్నాయి. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు నాగజ్యోతి, సీతా నాగజ్యోతిల శిష్య బృందం 'కూచిపూడి దర్పణం' పేరిట ప్రదర్శించిన పలు నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో స్వరజతి, వాణికి వందనం, దశావతారం, ఔరశబ్దం, తులసీదాస్ కీర్తన, కొలువైతివా, బృందావన సాగరం ధిల్లాన అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, ప్రొఫెసర్ టీజీ రూప, సాయి శిరీషా, శృతి, శ్రియ శేషాద్రి, కావ్య గోపాలకృష్ణ, రుద్ర వైష్ణవికరణం, శివాణి, కీర్తన సుబ్రహ్మణ్యం, సాయి యుక్త, పీ చార్వి, శ్రీ మేఘ, శ్రీ మనస్వి, చరితలు పాల్గొన్నారు.

చిత్తారమ్మ ఆలయంలో షెడ్డు ప్రారంభం

షెడ్డు ప్రారంభోత్సవంలో కూనశ్రీశైలంగౌడ్, తదితరులు

దుండిగల్,జూన్16: ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్‌లోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి కృపాకటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అభిలషించారు. అంతకుముందు శ్రీశైలంగౌడ్ చిత్తారమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగా, ఆహారం, దినచర్య మార్పులతో మధుమేహం నియంత్రణ

కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో మధుమేహ నియంత్రణ క్యాంపు ముగింపు సమావేశంలో యాదుకృష్ణ

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16 : మధుమేహం(డయాబెటిస్) అనేది రోగం కాదని.. జీవక్రియ(మెటబాలిక్ డిజార్డర్)లో లోపమని... ప్రతి రోజు యోగా సాధన, ఆహారం, దినచర్యలో మార్పులు చేసుకుని మనుస్సును ప్రశాంతంగా ఉంచుకుంటే మధుమేహాన్ని నియంత్రించవచ్చని తెలంగాణ స్టేట్ వెస్ట్ అధ్యక్షుడు యాదుకృష్ణ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల ఉచిత మధుమేహ నియంత్రణ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..మధుమేహం అనేది వయస్సుతో సంబంధం లేదని, పలు కారణాలతో అన్ని వయస్సులవారు దానిబారిన పడుతున్నారన్నారు. మధుమేహం వచ్చిందని బాధపడోద్దని, అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యోగా సాధన, ఆటలు, శారీరక శ్రమ, చక్కటి ఆహారం, నిద్ర, ఒత్తిడి లేని జీవితాన్ని గడిపితే మధుమేహం నియంత్రణలో ఉంటుందని, తద్వార జీవితాన్ని ఆనందంగా హాయిగా ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, జోనల్ అధ్యక్షుడు రమేశ్‌బాబు, అంజిబాబు, సెంట్రల్ ఇన్‌చార్జి శిరీష, శవిదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాన్ని ముందుతరాలకు అందించాలి

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ..

జగద్గిరిగుట్ట, జూన్16 : సంప్రదాయాలు ముందుతరాలకు అందించేందుకు వారసత్వ కళలలను ప్రోత్సహించాలని పలువురు కళాకారులు సూచించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌లో ఆదివారం శ్రీదేవి సంగీత నృత్యనికేతన్ 15వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నాట్యగురువు అచ్యుతాంబ నేతృత్వంలో విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోటీ ప్రపంచంలో సంప్రదాయ కళలను ప్రోత్సహించాలని సూచించారు.

ఈ సందర్భంగా గురువులు, విద్యార్థులను మొమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్వ శంకరయ్య, నాట్యగురువు అచ్యుతాంబ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం..

వివేకానందనగర్ కాలనీలోని శ్రీభూనీలాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి బీజేపీ నేత వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, తదితరులు హాజరై పూజలు చేశారు.

– అల్లాపూర్, జూన్ 16

అభినందనలు..

దుండిగల్, జూన్ 16 : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషర్స్ కో-ఆపరేటివ్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్‌గా నియమితులైన చిన్నంగి వెంకటేశం ముదిరాజ్‌ను ఆదివారం దుండిగల్‌లోని తన నివాసంలో మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కావలి గణేశ్, మాజీ ఎంపీటీసీ బండారి మహేశ్, నాయకులు ఆకుల ప్రేమ్‌కుమార్, దొంతి మహేశ్ ముదిరాజ్, మైలారం యాదగిరి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కు పనులు పూర్తి చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16 : కేపీహెచ్‌బీ కాలనీ 1,2వ ఫేజ్‌ల పరిధిలోని నేతాజీ పార్కులో అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. ఆదివారం కాలనీలోని పార్కులో కేపీహెచ్‌బీ కాలనీ 1,2వ ఫేజ్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సమావేశమై..సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఉత్సాహంగా శిల్పధాన్..

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శిల్ప బృందావన్ కాలనీలో వార్షిక శిల్పధాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో 5, 10 కిలోమీటర్ల పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు , చిన్నారులు సైతం శిల్పధాన్‌లో పాల్గొని సకాలంలో పరుగును పూర్తి చేశారు. ఈ సందర్భంగా పరుగును సకాలంలో పూర్తి చేసిన వారికి పతకాలను అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 16 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) ఈ కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.57, వంకాయ 28, బెండకాయ 60, పచ్చిమిర్చి 65, బజ్జి మిర్చి 65, కాకరకాయ 55, బీరకాయ 75, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 135, క్యారెట్ 45, కాలీ ఫ్లవర్ 23, దొండ 40, చిక్కుడు 65, గోరుచిక్కుడు 50, బీట్‌రూట్ 19, క్యాప్సికం 70, ఆలుగడ్డ 33, కీరా 35, దోసకాయ 28, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 45, ఉల్లిపొరక 85, ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 10 నుంచి 11, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDDRESSAL COMMISSION , RANGA REDDY DISTRICT AT : L.B.NAGAR
E.A. 69 OF 2023
IN
C.C.NO. 202 OF 2022
BETWEEN:
Ishta kameswari Natukodi Farms, Rep.by its Proprietor ..Complainant
AND
Naveen Polurty Incubators, Rep.by its Authorised Signatory ...Respondent
NOTICE
To,
Naveen Polurty Incubators, Office & Factory : Plot No.149, PrasanthNagar, Miyapur, Hyderabad-500049.
Rep.by its Authorised Signatory & Managing Director M.Srinivas @ Srinivasa Rao.
...Respondent/Opposite party
Please take notice that, the above said petitioner filed the above Petition against you For above case **CC/202/2022** filed for Damages now for the Execution of CC case the Petiotioner filed **E.A/69/2023** and Before The Hon'ble District Consumer Disputes Reddressal Commission, Ranga Reddy District. The Said Case is Coming for your Appearance on 25-06-2024, Because of the Legal notices Send by Complainant And Summons Send by the above Hon'ble Court according to your Tax Invoice Office & Factory Address, But You Are Intentionally and Wantedly Avoiding to take notices & Court Summons.
Hence you are hereby informed to appear before the above said court on 25-06-2024 at 10:30 A.M., in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.
(By order of the Court)
T.Gnana Sekhar Reddy MBA,LLB
Advocate
H.No: 1-9-34, 3rd line, Vidyut Nagar, Dilsuknagar, Hyderabad-500060.
Cell.No: 9581805959.